

కథ 2008

11

# UFO

## బి. అజయ్‌ప్రసాద్

రోదసినౌక అనంతమైన చీకటి అగాధంలోకి జారిపోతున్నట్లుగా అంతరిక్షంలోకి దూసుకుపోతూ ఉంది. అతడి కళ్ల ముందు కోటానుకోట్ల నక్షత్రాలతో... అనంతమైన రహస్యాలతో... శూన్యంలోకి తెరుచుకున్న విశ్వం...! నల్లటి అంతు తెలియని అగాధాన్ని తనలో పొదువుకుని అనంతంలోకి విస్తరిస్తున్న నల్లటి నిశీధి...!

అంతరిక్షయానం చేస్తున్న వ్యోమగాములిద్దరూ నౌకలోని చిన్న టన్నెల్‌లాంటి పొడవాటి గదిలో శరీరం బరువును కోల్పోయి శూన్యంలో వేలాడుతున్న సాలీడు పురుగుల్లా ఉన్నారు. వాళ్ల గ్రహాంతర యాత్ర మొదలై అప్పటికే మూడు నెలలు గడిచిపోయాయి. జీవరాశి మనుగడ సాగిస్తున్న మరో గ్రహం దిశగా వాళ్ల నౌక సాగిపోతూ ఉంది.

ఈ అనంతమైన విశ్వంలో మరొక ప్రాణి ఉందా... ఉంటే అది జీవపరిణామంలో ఏ దశలో ఉంది...వారి స్వరూప స్వభావాలేమిటి... వాళ్లు నాగరికతను అభివృద్ధి చేశారా... వాళ్లకు భాష, లిపి ఉన్నాయా... వందల సంవత్సరాలుగా ప్రపంచాన్ని ఉత్కంఠతలూగించిన ప్రశ్నలివే.

విశ్వంలో గ్రహాంతర వాసుల గురించి వారి అన్వేషణ ఇప్పటిదికాదు. విశ్వం ఆవిర్భావం, నక్షత్రాలు, గ్రహాల పుట్టుక గురించి అనేక పరిశోధనలు జరిగినా జీవరాశి మనుగడ గురించిన ప్రశ్నలకు అనేక సంవత్సరాల పాటు సమాధానం దొరకలేదు. దానికి కారణం వాళ్లకు తెలిసిన గ్రహాలలో నీరు లేకపోవడం లేక నీటి జాడ ఉన్న గ్రహాలు అందుబాటులో లేకపోవడం.

చివరికి విశ్వాంతరాళంలో ఒక నక్షత్రం చుట్టూ తిరుగుతూ జీవరాశి మనుగడ సాగించే అచ్చం భూమిలా ఉండే మరొక గ్రహాన్ని కనుక్కున్నారు. కోటానుకోట్ల నక్షత్రాలతో కూడిన గెలక్సీలు స్థిరంగా ఉండక, వర్తులాకారంలో తిరుగుతూ ఉండటంచేత అది సాధ్యపడింది. విచిత్రమేమిటంటే వాళ్లు కనుక్కున్న గ్రహం మీద ఇంకా పాత రాతియుగమే నడుస్తున్నట్లు, అక్కడ ఇంకా పరిణామం చెందని ఆదిమ మానవులు మనుగడ సాగిస్తున్నట్లు తెలుసుకున్నారు.

శూన్యంలో తేలుతూ, నౌకలో అమర్చిన చిన్న మెటాలిక్ మిర్రర్ నుంచి అంతరిక్షంలోకి చూస్తున్న వ్యోమగామి- అతడి వయసు ముప్పై ఐదు సంవత్సరాలు- రోదసియాత్ర అతడికి కొత్తకాదు. ఐదు సంవత్సరాల క్రితం మానవులు తొలిసారిగా చేసిన అంతరిక్ష యాత్రలో గ్రహాంతరవాసిని భూమి మీదకు తీసుకు వచ్చిన అనుభవం అతనికుంది. ఆ సంఘటన తరువాత చాలారోజులపాటు ఎవరికీ కనిపించకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. తన అజ్ఞాత జీవితంలో అతడు ప్రకృతి వ్యవసాయం చేసి పూర్తి ప్రకృతివాదిగా మారినట్లు చెప్పుకుంటారు.

నౌకలో ఉన్న మరొక వ్యోమగామి- మొదటి వ్యక్తికంటే వయసు కాస్త చిన్నవాడు. రోదసియానం అతడికిదే మొదటిసారి. దీనికోసం అతడు ప్రత్యేకించి సైన్యం నుంచి ఎంపిక చేయబడ్డ వ్యక్తి. అంతకు ముందు అతడు సైన్యంలోకల్నల్‌గా పనిచేసేవాడు. వృత్తిరీత్యా కల్నల్ కాబట్టి నౌకలో తనకంటే అనుభవజ్ఞుడైన తన సహచరుడిని, 'కమాండర్' అని పిలవడం అతడి కలవాటు! ఈ కల్నల్ నిరంతరం ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉంటాడు.

వాళ్ల గ్రహాంతర యాత్ర మొదలైన దగ్గర నుంచి కమాండర్ ఎక్కువ రోజులు మౌనంగా నిశ్శబ్దంగా ఉంటున్నాడు. చీకటి సముద్రంలోకి జారిపోతున్నట్లుగా ఉన్న నౌకలోంచి తీక్షణమైన అతడి కళ్లు అంతరిక్షంలోని నల్లటి నిశీధిని చూస్తున్నాయా లేక తనలోని శూన్యాన్ని చూస్తున్నాయో చెప్పడం కష్టం.

అతడిని చూస్తే ఒక్కోసారి దేనికోసమో ఎదురు చూస్తున్న వాడిలా అనిపిస్తాడు. మరొకసారి ఇంక దేని కోసమూ ఎదురుచూడనక్కర లేదన్నట్లుగా నిర్లిప్తంగా ఉంటాడు. యుక్తవయసులో ఉన్న కల్నలుకు నిర్జన మైన రోదసియానం కన్నా కొద్దిరోజులుగా ఈ కమాండర్ మౌనం ఎక్కువగా భయపెడుతూ ఉంది. గత కొద్దిరోజు లుగా అతడిచేత ఏదో ఒకటి మాట్లాడించడానికి ప్రయత్నిస్తూ ఉన్నాడు.

''దేని గురించైనా చెప్పండి కమాండర్!''

''దేని గురించి మాట్లాడమంటావు కల్నల్?''

''దేనిగురించైనా... ఉదాహరణకి మీరు క్రితం సారి గ్రహాంతరవాసిని పట్టుకున్నారు కదా... ఆ విషయం గురించి చెప్పండి వింటాను,'' అన్నాడు.

కమాండర్ కొద్దిసేపు మౌనంగా ఉండిపోయాడు. అది ఐదు సంవత్సరాల క్రితం జరిగిన, అతడి జీవితాన్ని మార్చివేసిన సంఘటన. ఆరోజు జరిగిన సంఘటనలను గుర్తుకు తెచ్చుకుంటూ జరిగింది చెప్పసాగాడు.

''ఆరోజు... ఆ గ్రహం మీద ఒక కొండ ప్రాంతానికి కిలోమీటరు దూరంలో సరస్సు పక్కనే మా నౌక దింపాము. కొండకి మరొకపక్క దట్టమైన అరణ్యం ఉంది. నాతోపాటు వచ్చిన నా సహచరుడు బైనాక్యులర్ తీసుకుని సరస్సు ఒడ్డునే ఉన్న ఒక చెట్టెక్కి కొమ్మ మీద కూర్చున్నాడు. మాకు కిలోమీటరు దూరంలోని కొండ రాళ్ల మధ్య నల్లటి ఆకారాలు అప్పుడప్పుడు కనిపిస్తూ కనుమరుగవుతున్నాయి. ఆ ఆదిమానవులలో ఎవరో ఒకరు నీటి కోసం ఆ సరస్సు దగ్గరకు వస్తారని మాకు తెలుసు. మేమిద్దరం చాలాసేపటి వరకు గ్రహ వాతా వరణాన్ని పరిశీలిస్తూ ఉన్నాము. నేను సరస్సులోని నీటి వంక చూస్తూ కూర్చున్నాను. ఆ నీరు ఎంత స్వచ్ఛంగా ఉందంటే ఆకాశంలోని మేఘాలు, సరస్సుని ఆనుకుని ఉన్న ఆకుపచ్చని నిర్జనారణ్యం అందులో స్పష్టంగా కని పిస్తున్నాయి. అది నీరేనా లేక ఇంకేదైనా పాదరసం లాంటి రసాయన ద్రావకమా అని ఆలోచిస్తూ కూర్చున్నాను.

''ఇంతలో నా సహచరుడు కొండరాళ్ల మధ్య నుంచి ఎవరో నడిచొస్తున్నట్లు సైగ చేసి తన రివాల్వర్ సరిచేసుకున్నాడు. నేను వల తీసుకుని చెట్టు చాటుకు వెళ్లి నుంచున్నాను. కొద్దిదూరంలో కొండపై నుంచి దిగు తున్న ఒంటినిండా రోమాలతో నగ్నంగా ఉన్న ఆదిమ మానవుడు...!''

కమాండర్ చెబుతూనే కల్నల్ వంక చూశాడు. కల్నల్ నడుముకి బెల్టు పెట్టుకుని నిద్రపోతూ కనిపిం చాడు. అతడికి తను ఏదో ఒకటి మాట్లాడుతుండటమే కావలసింది అనుకుని కమాండర్ తనలో తను నవ్వు కున్నాడు.

అప్పటివరకు తను కల్నలుకు వివరిస్తూ వచ్చిన ఆ సంఘటన అతడి కళ్ల ముందు కదలాడింది.

ఆ నియాండర్తల్ మానవుడిని పట్టుకోడానికి ఆరోజు చాలా కష్టపడవలసి వచ్చింది. అతడి దేహబలం ముందు తమ శక్తి చాలలేదు. కాని తాము బిగించిన ఉచ్చు బిగుసుకోవడంతో అతడేమీ చేయలేకపోయాడు. చివరికి క్రూరమైన తమ నాగరికత ముందు ఆ ఆదిమ మానవుడు ఓడిపోయాడు.

*

నౌకలోని స్థలకాలాలను సూచించే టైమర్ తాము మార్స్ గ్రహాన్ని సమీపిస్తున్నట్లు సూచించడంతో కల్నల్ టెలిస్కోప్ బిగించిన చోటుకు శూన్యంలో తేలుతూ వెళ్లాడు. వాళ్లు అంతరిక్ష యాత్రలో సౌర కుటుంబంలోని కొన్ని గ్రహాలను చుట్టిరావడం కూడా ఉంది.

కల్నల్ టెలిస్కోపు లోంచి చూస్తూ, ''మౌంట్ ఒలంపస్- సౌరకుటుంబంలోని అతి ఎత్తైన పర్వతం- ఇది భూమి మీద ఉన్న హిమాలయాల కంటే మూడు రెట్లు పెద్దది. మీరూ చూస్తారా...'' అన్నాడు కమాండర్ని ఉద్దేశించి.

కమాండర్ తల తిప్పకుండానే, ''వద్దు, క్రితంసారి వచ్చినప్పుడు చూశాను,'' అన్నాడు. కల్నల్ మళ్లీ టెలీ స్కోపులోకి చూపు సారించాడు. కక్ష్యలోంచి చూస్తుంటే ఒలంపస్ పర్వతం ఒక పెద్ద పిరమిడ్‌లా అతడి కళ్లకు కనిపించింది. ఆ తరువాత కుజగ్రహానికి చెందిన ఫోటో లను భూమికి పంపడంలో నిమగ్నమైపోయాడు.

ఇరువురి మధ్యా గడిచిపోతున్న మౌనఘడియలు. కల్నల్ తల వంచుకుని పని చూసుకుంటూనే మళ్లీ మాట్లాడటం మొదలెట్టాడు.

''నాలాగా మీకు ప్రతిదీ వింతగా కనిపించక పోవచ్చు. అయితే కమాండర్- ఈ అనంతవిశ్వంలో మీకు ఆసక్తి కలిగించే అద్భుతమైన విషయం ఏదీ లేదా?''

కల్నల్ ప్రశ్నకు కమాండర్ తొట్రుపడ్డాడు. ఊహించని ప్రశ్న. అతడి సమాధానం కోసం చూడకుండా కల్నల్ తన పని తను చేసుకుపోతున్నాడు.

తనకు ఆసక్తి కలిగించే విషయం- అది ఏమై ఉంటుంది? తనకు ఊహ తెలిసిన దగ్గర నుంచి అనంతమైన ఈ రోదసి ఒక రహస్యంగానే ఉంది. జిజ్ఞాసా ప్రవాహంలో అతడు గ్రహాంతరయాత్ర చేసేవరకూ వెళ్లాడు. ఇప్పుడు ఈ కల్నల్ చూసి ఆనందించే అద్భుతమైన గ్రహాంతర రహస్యాలు ఒకప్పుడు తనలో తెలియని ఆసక్తి రేపేవి. నిర్జనమైన గ్రహాంతర ప్రపంచాలలోకి తనెప్పుడూ చూపులు నిలిపే ఉంచేవాడు. అప్పుడు విశ్వంలోని అణువణువూ తన కళ్లకి అత్యద్భుతంగా గోచరించేది. మరి ఇప్పుడు-

తను ఎంతో మహత్తరమైనవిగా భావించే గ్రహాలు, నక్షత్రాలు, నెబ్యులాలు, గెలక్సీలు అన్నీ దూది పింజల్లా తేలిపోయాయి. అనంతమైన నల్లటి విశ్వం ఇప్పుడొక చీకటి నిండిన అగాధంలానే మిగిలిపోయింది. దీనికి కారణం ఏమిటి?... ఉంది... అది...

''UFO,'' కమాండర్ తనలో తను గొణుక్కున్నాడు.

''UFO'' కమాండర్ తనలో తను గొణుక్కున్నా అతడు వేసుకున్న రోదసి దుస్తుల నుంచి ధ్వనితరంగాలు కల్నలు చెవులకు చేరాయి. UFO అన్నమాట అతడి చెవిలో వినపడగానే అతడు పగలబడి నవ్వడం ఆరంభించాడు. తలకు వేసుకున్న ఆక్సిజన్ మాస్క్ నుంచి అతడి హావభావాలు కనిపించడంలేదు గాని శరీరపు కదలికలను బట్టి అతడు పడిపడి నవ్వుతున్నట్లు తెలుస్తూనే ఉంది.

అతడలా నవ్వడంలో ఆశ్చర్యం లేదు. భూమి మీద కొన్ని వందల సంవత్సరాల క్రితం ఆకాశంలో ఎగిరే గుండ్రటి ఆకారాలను చూశారు. చూడటానికి అవొక ఎగిరేపళ్లాల మాదిరి ఉండటంతో వాటిని ఎగిరే పళ్లాలు అంటే మరికొందరు UFO (ఎగిరే అజ్ఞాత వస్తువు) అని పిలిచారు. కాలక్రమంలో ఉధృతమైన గాలుల వలన మేఘాలు అటువంటి ఆకారం దాలుస్తాయని తెలుసుకోవడంతో వాటి సంగతి అందరూ మరిచిపోయారు.

''UFO అదొక ఎగిరిపోయిన కల... నువ్వింకా ఏ యుగంలో ఉన్నావు కమాండర్?'' అంటూ కల్నల్ మళ్లీ తన పనిలో నిమగ్నమయిపోయాడు.

కమాండర్ ఇంకా ఆలోచిస్తూనే ఉన్నాడు. నిజంగా విశ్వంలో మహత్తరమైన విషయమేది? నిజంగా తను అన్వేషిస్తున్నదేమిటి? ఈ కల్నల్ భావించినట్లు కొన్ని వందల సంవత్సరాల క్రితం కనిపించి అదృశ్యమైన UFO అని పిలబడే ఎగిరే పళ్లాల గురించా? అది అసంఖ్యామైన చరాచర జీవరాశికీ అనంతమైన ప్రకృతికీ మధ్య ఉండే అవినాభావ సంబంధం... కళ్లెదుటే వుండి కంటికి కనిపించని ప్రకృతి నియమం... అనంతమైన జీవ సౌందర్యం... రహస్యం...!

కోటానుకోట్ల శరీరాలు- అద్భుతమైన దేహాలు... బాహ్య వాతావరణంతో జైవిక సంబంధం ఏర్పరచుకున్న అద్భుతమైన దేహాలు... జీవరాశికంతటికీ సారూప్యత గల ఒకే రకమైన జీవన క్రియలు... శ్వాసించడం... జీర్ణవ్యవస్థ... సంతానోత్పత్తి... ఈ జీవన క్రియలన్నిటిని నడిపించేదేమిటి? అనంతమైన విశ్వంలో రెక్కలు విస్తరించిన అసలైన రహస్యం అదే... అదే అసలైన అన్ఐడెంటిఫైడ్ ఫ్లయింగ్ ఆబ్జెక్ట్. అదే UFO. ఖగోళంలో అంతకంటే మరొక అద్భుతమైన విషయం లేదు.

తనలో వచ్చిన మార్పేమిటి? అంతరిక్ష శాస్త్రజ్ఞుడిగా ఉన్న తను జీవ శాస్త్రజ్ఞుడిగా ఎలా పరిణామం చెందాడు? దీనికంతటికీ కారణం ఎవరు?

*

మొదటిసారి అతడు గ్రహాంతర యాత్ర చేసి వచ్చిన తరువాత దాని తాలూకు జ్ఞాపకాలు రోజుల తరబడి అతడిని వెంటాడాయి. ఆ గ్రహంలో తను చూసిన సరస్సు, దానికి ఆనుకుని ఉన్న అరణ్యం... దాని సౌందర్యం పదేపదే గుర్తుకు రాసాగింది. అంతకు మించి నాగరికత ఛాయలేని ప్రకృతిలో మమేకమైన జీవన సౌందర్యం అతడికి అనుభవపూర్వకంగా తెలిసి వచ్చింది.

మరీ ముఖ్యంగా తాము నియాండర్తల్ మనిషిని బంధించిన విధం, తమను ఎదిరించలేని ఆటవికుల అశక్తత అతడిని పదేపదే పట్టి పీడించసాగింది. ఒకరోజు అతడు నియాండర్తల్ ఆదిమ మానవుడిని చూడటానికి వెళ్లాడు. ఆ సంఘటన అతడి జీవితాన్ని మార్చివేసింది.

మొదటిసారి తను చూసిన అతడి రూపం- ఒంటి నిండా రోమాలతో కొద్దిగా ముందుకు వచ్చిన దవడ ఎముకలతో వెడల్పాటి తలతో-

వాళ్లు బంధించి తెచ్చిన గ్రహాంతరవాసికి భూమి మీద కొన్ని యుగాల క్రితం జీవించిన నియాండర్తల్ మానవుడి లక్షణాలున్నాయని తెలుసుకున్నారు.

అతడిని నాగరికుడిగా మార్చడానికి వాళ్లు చాలా కష్ట పడవలసి వచ్చింది. అతడిని క్రూరమృగాలను వుంచే బోనులో కొన్ని రోజులపాటు ఉంచారు.

జీవరాశి మనుగడ సాగించే మరో గ్రహం యొక్క వాతావరణం, అక్కడి ఇతర జీవరాశుల గురించి మరిన్ని వివరాలు తెలుసుకోడానికి వాళ్లు ఆ నియాండర్తల్ మానవుడికి తమ భాష, నాగరికత నేర్పడం ప్రారంభిం చారు. అతడికి 'న్యూహోప్' అని పేరు పెట్టారు.

అతడు న్యూహోప్‌ని చూడటానికి వెళ్లేటప్పటికి అతడు బోనులోంచి చిన్న గదిలోకి మార్చబడ్డాడు. ఆదిమ మానవుడు పరిపూర్ణ ఆధునిక మానవుడిగా రూపొందుతున్న క్రమం.

కాలర్ వెనుకగా వెడ మీద కనిపిస్తున్న వెంట్రుకలు... అదే దృఢమైన శరీరం... కత్తిరించి ఒక పక్కకు దువ్విన తల వెంట్రుకలు...

న్యూహోప్ అతడిని చూడగానే, ''హెలో... ఎలా ఉన్నావు?'' అడిగాడు. ఆదిమదశ నుంచి ఆధునిక మానవునిగా రూపాంతరం చెందుతున్న మనిషి... ఎంత పురోగతి...!

అతడు అమితమైన ఆశ్చర్యంలోంచి తేరుకోక ముందే మళ్లీ న్యూహోప్ కృతజ్ఞత నిండిన కళ్లతో చూస్తూ, ''థాంక్యూ సర్,'' అన్నాడు.

అతడికేమని సమాధానం చెప్పాలో అర్థంకాలేదు. వెనక్కి తిరిగి బయటకు వచ్చేశాడు. జరిగింది తల్చు కుంటే అతడికి గగుర్పాటు కలిగి, మానవ జీవితమంటే ఒక విధమైన రోత కలిగింది. ఆరోజు నుంచీ తన చుట్టూ ఉన్న జీవితాన్ని పరిశీలించసాగాడు.

ప్రపంచాన్ని, మనిషి జీవితాన్ని అర్థం చేసుకొనే కొద్దీ భూమి మీద ఆధునిక మానవుడు తన జీవితాన్ని తను అనుభవించడం లేదని అర్థమయింది.

అతడికి మనుషులందరిలోనూ కనిపించిన జీవనసూత్రం- తూర్పు నుంచి పడమర దాకా, ఉత్తరం నుంచి దక్షిణం దాకా భూమి మీద మనిషిని చుట్టు ముట్టే ఒకే ఒక అంతఃసూత్రం- మనుగడ.

నిరంతరం సంక్లిష్టంగా మారుతున్న మనిషి మను గడ... మూసగా తయారయి... మరింత విషాదభరితం చేయబడుతూ... నిరర్థకమైన నిస్సారమైన జీవితపు నమూనాని మనుషులు తమ తరతరాలకు అందించ డానికి పరితపిస్తూ సమస్త మానవ జీవితం ఎక్కడో గాడి తప్పినట్లు అతడికి అనిపించసాగింది.

అంతేకాక మనిషి తన శరీరంలోనే అనంతమైన జీవనక్రియల సౌందర్యాన్ని ఉంచుకుని విశ్వంలోని అనంత రహస్యాలను అన్వేషించడం అతడికి నిరర్థకం గా అనిపించింది.

సాపేక్షత లేని ప్రకృతి అర్థమయ్యేకొద్దీ అతడు మిగతా ప్రపంచానికి దూరంగా అజ్ఞాతంలో జీవించ సాగాడు. కాలక్రమంలో మరొక నాలుగు సంవత్సరాలు గడిచి పోయాయి.

తనలో వస్తున్న మార్పేమిటి... తను ప్రకృతికి మరింత దగ్గరగా... ఒక నియాండర్తల్ మానవుడిలా జీవించాలని కోరుకుంటున్నాడా...!

*

''ఈ నౌకలో నీవు ఒంటరిగా ప్రయాణం చేయ గలవా?''

ఆ సమయానికి వాళ్లు జూపిటర్‌కి ఉన్న అయో అనే చందమామ చుట్టూ కక్ష్యలో తిరుగుతూ ఉన్నారు. అయో సౌర కుటుంబంలో అనునిత్యం అగ్నిపర్వతాలు పేలుతుండే అరుదైన చందమామ.

కమాండర్ అడిగిన ప్రశ్న అతడి చెవులను చేర లేదు. అతడు పసుపు ఎరుపు వర్ణాలు కలగలిసిన నైరూప్య దృశ్యంలో అగ్నిపర్వతం నోరు తెరుచుకుని బద్దలవుతున్న దృశ్యాన్ని టెలీస్కోపు నుంచి ఆసక్తిగా చూస్తున్నాడు. టన్నుల కొద్దీ బరువున్న శిలలు అగ్ని పర్వతంలోంచి పైకెగిరి వింతైన గురుత్వాకర్షణకి స్లోమోషన్‌లో నేలమీద పడుతుండటం అతడి కళ్లకి ఆశ్చర్యంగా ఉంది.

జూపిటర్‌కి ఉన్న చందమామలలో ఐరోపా, అయో చూడదగ్గవి. జూపిటర్ మీద ఒట్టి మేఘాలతో కూడిన చారలు తప్ప చూసేందుకు అక్కడేమీలేదు. ఇక ఐరోపా ఉపరితలం అడుగున సముద్రాలు ఉన్న ట్లుగా ఎప్పుడో కనుక్కున్నారు.

ఈ అగ్నిపర్వతం పేలే శబ్దాన్ని తను వినగలిగితే ఎంత బాగుండును, అనుకుంటూ టెలీస్కోపు నుంచి తల పైకెత్తి కమాండర్ వైపు చూశాడు.

''ఈ నౌకలో నీవు ఒంటరిగా తిరిగి భూమి మీదకు వెళ్లగలవా?'' మళ్లీ అదే ప్రశ్న.

సమాధానం కోసం ఎదురుచూడని ప్రశ్న. ఈ కమాండర్ దేని గురించి అడుగుతున్నాడు. నిర్ఘాంత పోయి అతడివైపు ప్రశ్నార్థకంగా చూశాడు కల్నల్. మళ్లీ అవతలివైపు నుంచి అదే ప్రశ్న. నౌకలో ఒక వింత కీటకంలా వేలాడుతున్నాడు కమాండర్. అతడి వెనుక దట్టమైన చారలతో గోడలా కనిపిస్తూ ఉంది జూపిటర్.

కల్నల్ టెలీస్కోపులోంచి తలపెట్టి చూస్తూనే ఉన్నాడు. బంగారువర్ణపు నిర్జనమైన నేల- వాళ్ల నౌక

అగ్నిపర్వతాన్ని దాటి నిర్మానుష్యమైన మైదానాలను చూపుతూ పోతున్నది.

"మీరలా ఎందుకడుగుతున్నారో తెలుసుకోవచ్చా?"

కమాండర్‌కు మాత్రం ఇది ఊహించని ప్రశ్నేమీ కాదు. "రోదసిలో ఏదైనా జరగవచ్చు- ఉదాహరణకి ఈ క్షణానికే నేనే మరణిస్తానేమో..."

అతడి మాటలకి కల్నల్ గట్టిగా నవ్వేశాడు. అతడు పగలబడి నవ్వుతూనే, "ఒకవేళ అలా జరిగితే... అసలలా జరగదనే అనుకుంటున్నాను... ఇక దాని గురించి ఆలోచించడమే అనవసరం," అన్నాడు.

కమాండర్ ఆ పూటంతా నిశ్శబ్దంగా గడిపాడు. వాళ్ల నౌక అయో చుట్టూ మరో రెండుసార్లు భ్రమణం పూర్తిచేసి రోదసి దిశగా ముందుకు సాగింది. తన యాత్రలో చివరిసారిగా అతడు తన గతాన్ని మరొకసారి గుర్తు చేసుకున్నాడు.

*

అతడితో పాటు గ్రహాంతర యాత్ర చేసిన అతడి సహచరుడు ఒకరోజు అతడిని చూడటానికి వచ్చాడు. అప్పటికే జనజీవన స్రవంతికి దూరంగా జీవిస్తున్న తన మిత్రుడి గురించి అతడు విని ఉన్నాడు. తీరా తన కళ్లతో చూసాక తను విన్నదాంట్లో అతిశయోక్తి లేదని అతడికి అర్థమయింది.

"నువ్వింకా దేనికోసం వెతుకుతున్నావు? మన గ్రహాంతరవాసిని కనిపెట్టి చరిత్రలో ఒక అద్భుతమైన విజయాన్ని సాధించాం. ఇక తెలియనిదంటూ ఏమీ లేదు."

తన మిత్రుడి మాటలకు అతడు నవ్వి, "మీ అందరి అన్వేషణ ఏనాడో పూర్తయింది. నేనింకా కనిపించని దేనికోసమో వెతుకుతూనే ఉన్నాను. నిజానికి నా అన్వేషణ ఇప్పుడే మొదలైంది," అన్నాడతడు.

"కనిపించని వస్తువు," అతడు అర్థం కానట్లు చూసాడు.

"అవును. అది ఒకచోటుండి మరొకచోట లేనిది కాదు. అది విశ్వమంతటా సమస్త చరాచర జీవరాశిలో పనిచేస్తూనే ఉంది. అది సాపేక్ష దృష్టికి అందని ప్రకృతి నియమం."

అతడి మిత్రుడు నిశ్చేష్టుడయి, "నీవొక ఆధ్యాత్మికుడిలా మాట్లాడుతున్నావు. నువ్వు చెప్పేది దైవశక్తి గురించా," అన్నాడు.

"ఈ చరాచర జగత్తుని ఏదో తెలియని శక్తి నడిపిస్తుందనుకోవడం దైవశక్తిని అంగీకరించడానికి మూలం. ఏదో తెలియని అజ్ఞాత దైవశక్తి అనంతమైన ఈ విశ్వాన్ని నడిపిస్తుందనుకుంటే అసలు నేను రోదసి యాత్ర చేసేవాడినే కాదు. అనంతమైన ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ ఇదంతా కేవలం దైవసృష్టి అనుకుంటే నా కళ్లకు అందులోని సౌందర్యం అదృశ్యమవుతుంది. మనమొక అద్భుతమైన గ్రహాంతరవాసిని కనిపెట్టి తెచ్చామని చెప్పుకుంటున్నాము. నా దృష్టిలో అదేమంత గొప్ప విషయం కాదు. అద్భుతం అంతకంటే కాదు. అంతకుమించి కొన్నిరెట్ల జీవరాశి మనమధ్యే ఉంది. యుగాల తరబడి మనం దానిని నిర్లక్ష్యం చేసి నాశనం చేస్తూ వచ్చాం. చరాచర జీవరాశిలో మనిషి కేవలం ఒక అల్పప్రాణి మాత్రమే. నాగరికత పురోభివృద్ధిలో మనిషి ప్రకృతి నుంచి దూరంగా వేరుచేయబడుతున్నాడు. ఇప్పుడు ప్రతిచర్య జీవితానికి వ్యతిరేకమే. దానివలన మనం సాధించబోయేది ఒక అర్థరహితమైన జీవిత విధానాన్ని మాత్రమే."

"నువ్వు చెప్పేది మానవపురోగతి అంతా నిరర్థకం అన్నట్లుగా ఉంది. కొన్ని యుగాల పాటు వెనక్కి వెళ్లడం తిరోగమన వాదం."

సమస్త మానవజాతి తిరిగి ఇప్పుడు పాత రాతి యుగం కేసి నడవదని నీకంటే నాకే బాగా తెలుసు. మానవజాతి ప్రకృతికి దూరంగా జరిగిందనేది సత్యం. ఈప్రపంచం మున్ముందుకు వెళ్లి నాగరికత పేరుతో సాధించబోయేదేమీ ఉండదు. మనిషిని తన జీవితాన్ని తను గడపనీయకుండా చేయడం తప్ప."

"కాలానికి అతీతంగా వెళ్లినవాడివి కాలం చెల్లిన మాటలు చెప్పడం వింతగా వుంది," అన్నాడతడు చివరికి వీడ్కోలు తీసుకుంటూ.

"నువ్వు కూడా స్థల కాలాల గురించే మాట్లాడుతున్నావు మిత్రమా," అన్నాడతడు చివరిసారిగా. వాళ్లిద్దరూ కలుసుకోవడం అదే ఆఖరుసారి. తన మిత్రుడు వచ్చి వెళ్లిన కొద్దిరోజులకు అనుకోకుండా అతడు మరొకసారి గ్రహాంతర యాత్రకు ఎంపిక చేయ బడ్డాడు. దాని ఫలితంగానే అతడిప్పుడు కల్నల్‌తో కలిసి రోదసియాత్ర చేస్తున్నాడు. తమ గ్రహాంతర యాత్రలో మరికొంత కాలానికి వాళ్లు సౌర కుటుంబాన్ని దాటిపోయారు.

*

చివరికి రోదసినౌక వాళ్లు చేరవలసిన గ్రహాన్ని సమీపించి గురుత్వాకర్షణకి గ్రహం చుట్టూ కక్ష్యలో తిరగసాగింది. కల్నల్ నౌకలోని మెటల్ డోర్ తెరచి గ్రహాన్ని వింతగా చూస్తున్నాడు. అతడి కళ్ల ముందు

దూదిపింజల వంటి తెల్లటి మేఘాలతో నీలపు వజ్రంలా... అచ్చం భూమిలానే ఉపగ్రహం...

కక్ష్యలో తిరుగుతున్న నౌక నుంచి చూస్తూ ఉంటే అర్ధచంద్రాకారంగా ఉండే గ్రహ క్షితిజపు ఒంపు కనిపిస్తూ ఉంది. ఒకపక్క గ్రహం మీద పడుతున్న నక్షత్రపు కాంతి కిరణాలు- పగలు. మరొకపక్క విస్తరిస్తున్న నీడ- చీకటి... నిర్మానుష్యమైన నిర్జన గ్రహం... అనంతమైన రహస్యాలను తనలో నింపుకుని.

ముందుగా నిర్ణయించిన పథకం ప్రకారం నౌక నుంచి ఇద్దరు మనుషులు కూర్చో గల మరొక చిన్న ఉపనౌక విడిపోయి సురక్షితంగా గ్రహ ఉపరితలం మీద దిగడం వాళ్ల ప్రయాణంలో ఆఖరి ఘట్టం.

మదర్ షిప్ నుంచి చిన్న ఉపనౌక విడిపోయి గ్రహ వాతావరణంలోకి ప్రవేశించగానే దానికి ఉన్న పారాచూట్ గొడుగులా విచ్చుకుంది. ఎక్కడ ఏ చిన్న తప్పిదం జరిగినా, వాతావరణం అనుకూలించకున్నా వాళ్లు పడిన శ్రమంతా వృథానే అవుతుంది.

పారాచూట్‌కి వేలాడుతున్న నౌకని సరస్సు ఒడ్డున దించగానే అక్కడ విచిత్రమైన కలకలం మొదలైంది. కమాండర్ బయటకు వచ్చి కొండమీదకు చూశాడు. అక్కడ కొండమైన రాళ్లలో ఏపుగా పెరిగిన చెట్ల మధ్య... ఒంటినిండా రోమాలతో... తమనే వింతగా చూస్తున్న నియాండర్తల్ మానవులు. తాము వచ్చినట్లు వాళ్లకెలా తెలుసు... బహుశా పారాచూట్‌ని చూసి ఉంటారు- వాళ్లు ఆలోచిస్తున్నంతలోనే కల్నల్ చెవిపక్క నుంచి రివ్వుమని సన్నటి మొనదేలిన కర్ర దూసుకుపోయింది.

పై నుంచి కొండరాళ్లు దొర్లి పడుతున్న శబ్దం... దట్టమైన చెట్లమధ్య నుంచి దగ్గరవు తున్న విచిత్రమైన కేకలు... అరుపులు... ఒకరిద్దరు కాదు... విచిత్రమైన ఆటవికులు... గుంపులు గుంపులుగా...

వాళ్లు తమని సమీపిస్తున్నారని కమాండర్‌కు అర్థమయింది. అతడు వెంటనే తన ఒంటి మీదున్న బట్టలను తీసి అవతలకు విసిరి సరస్సు ఒడ్డుకు పరిగెత్తుకుంటూ వెళ్లాడు.

అతడేం చేయబోతున్నదీ కల్నలుకు అర్థం కాలేదు. అతడు నిశ్చేష్టుడై చూస్తుండగానే పెద్ద కొండ రాయి దెబ్బకు దగ్గరలో ఉన్న చెట్టు విరుచుకుపడగా అతడు ముందుకు తూలిపడ్డాడు. ఆదిమ మానవులను చూసిన భయం కంటే కమాండర్ చేస్తున్న పని తత్తర పాటు కలిగించింది. అతడు వెంటనే తేరుకుని ఒణుకుతున్న చేతులతో రివాల్వర్ బయటకు తీసి ఆటవికుల మీదకు గురి పెట్టబోయాడు.

సరస్సు ఒడ్డున నుంచి కమాండర్ అరుపులు... "కల్నల్... పారిపో... అది పేలదు... నాకు తెలుసు..." ఒంటికి రాసుకున్న బురదతో ఇప్పుడతడు అచ్చం ఒక నియాండర్తల్ మానవుడిలా ఉన్నాడు. అతడు తనను తిరిగి ఒంటరిగా వెళ్లగలవా అని ఎందుకడిగాడో ఇప్పుడర్థమవసాగింది కల్నలుకు. పరిగెత్తుకుంటూ వెళ్లి నౌకలో కూర్చున్నాడు.

కొద్దిసేపైన తరువాత రోదసి నౌక పైకి లేచింది... ఒంటరిగా... మళ్లీ శూన్యంలోకి...

*ఆదివారం వార్త, 8 జూన్ 2008*

